ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 41
సంచిక : 169
పేజీలు : 3
బుధవారం, మార్చి 11, 2026
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## పలువురు నామినేషన్లు దాఖలు

**-చింతల గోపాల్ ప్రకటన**



**టి మీడియా, మార్చి 10, మధిర:** మధిర బార్ అసోసియేషన్ లో వివిధ పదవులకు పలువురు న్యాయవాదులు నామినేషన్ దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి చింతల గోపాల్ తెలిపారు. అధ్యక్ష పదవికి ఈరోజు కావూరి రమేష్ నామినేషన్దాఖలుచేయగా,ఇంతకుముందు చావలి రామరాజు నామినేషన్ దాఖలు చేశారు. ఉపాధ్యక్ష పదవికి భైరవ భట్ల వెంకటరమణ ప్రధాన కార్యదర్శి పదవికి గంధం శ్రీనివాసరావు, కోట జ్ఞానేష్ కోశాధికారి పదవకి తూములూరి సంధ్య నామినేషన్ దాఖలు చేశారు. జాయింట్ సెక్రెటరీ 1కి భైరవభట్ల వెంకటరమణ, జాయింట్ సెక్రెటరీ 2 కి సునీత మహిళా ప్రతినిధిగా మాధురి తేజ నామినేషన్ దాఖలు చేశారు.




### కవిత నిరాహార

# దీక్ష భగ్నం

**-మరో 33 మందిపై కేసు**

**టి మీడియా, మార్చి 10, ఖమ్మం:** వెలుగుమట్ల భూ బాధితులకి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాత్రి పునరావస కేంద్రంలో దీక్షకు కూర్చున్న జాగృతి అధినేత కవితని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఖమ్మం నగరంలో వెలుగుమట్ల వద్ద ఉన్న భూదాన భూముల్లో గుడిసెలు వేసుకుని ఉన్న వారిని గత నెల 24 తారీఖున పోలీసులు తొలగించారు. అయితే ఇది రాజకీయ వివాదంగా మారింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే పలువురు నేతలు వచ్చి పరామర్శించగా.. నిన్న జాగృతి అధినేత కవిత పునరావాస బాధితులని పరామర్శించి వారితో అంబేద్కర్ విగ్రహం వద్ద నాలుగున్నర గంటల పాటు ధర్నా నిర్వహించింది.ఆ తర్వాత పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే ఆ తర్వాత తిరిగి మళ్ళీ రాత్రి పునరావాస కేంద్రంలో కవిత తన నిరాహార దీక్షను చేపట్టింది. నిరాహారదీక్ష చేపట్టడంతో మంగళవారం తెల్లవారు జామున పోలీసులు ఆమెని అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో జాగృతి అధ్యక్షురాలు కవితతో పాటు మరో 33 మందిపై కేసు నమోదు చేశారు పోలీసులు. రోడ్డుపై బైఠాయించి ట్రాఫిక్కు అంతరాయం కల్పించినందుకు కేసు నమోదు చేశారు.

# బెల్ట్ జోరు.. జనం బేజారు

**-మత్తులో జోగుతున్న పల్లెలు, నగరాలు -కిరాణా షాపుల్లో ను అమ్మకాలు**



**టీ మీడియా మార్చి 10, ఖమ్మం బ్యూరో :** ఉమ్మడి జిల్లాలో బెల్ట్ షాపుల దందా జోరుగా సాగుతోంది. పల్లెలు, నగరాలు పట్టణాలని తేడా లేకుండా ఎక్కడికక్కడ దుణాలు నిర్వహిస్తున్నారు. కొన్నిచోట్ల ధరలు పెంచి బహి రంగంగా విక్రయాలు చేపడుతున్నారు. అ యినా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పలు గ్రామాల్లో కిరా ణా దుకాణాల్లోనూ మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం..సాగుతోంది.

**జిల్లాలో ఇలా..**

జిల్లాలో సుమారుగా 3 వేల వరకు బెల్ట్ షాపుల్లో దందా జోరుగా సాగుతోంది. దీంతో మారుమూల గ్రామా లు మత్తులో జోగుతున్నాయి. గ్రామాలు, తండాల్లో పుట్టగొడుగుల్లా బెల్ట్ దుకాణాలు వెలుస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా షాపులు ఏర్పాటు చేసి అధిక ధరలకు విక్రయిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుం టున్నారు. అనేక మంది బెల్టుషాపుల్లో మ ద్యం కొనుగోలు చేసి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. అప్పులు చేసి తాగడంతో కాపు రాలు వీధి పాలవుతున్నాయి.

**పట్టించుకోని అధికారులు**

బెల్టు షాపుల ద్వారా ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం సమకూరుతోంది. మరింత ఆదాయాన్ని పెంచుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం బెల్టుషాపులను అంతర్గతంగా ప్రో త్సహిస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంలో మహిళల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా.. ఎవరూ పట్టించు కోవడం లేదు. అటు ఎక్సైజ్ శాఖ అధికారులు కానీ.. ఇటు పోలీసులు కానీ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**అధికారులు కనుసన్నల్లోనే..**

అక్రమంగా మద్యం అమ్మకాలు కోట్ల రూపాయల్లో జరుగుతున్నాయి. వైన్స్ యజమానులు, ఎక్సైజ్ అధికారుల అండదండలతో ఊరూరా బెల్టుషాపులు నడుస్తున్నాయి. మద్యం అమ్మకాలు పెంచాలని ప్రభుత్వం ఎక్సైజ్ అధికారుల నుంచి ఒత్తిడి వస్తుండటంతో వ్యాపారులు సిండికేట్గా మా రి ఎక్కువ ధరలకు ఊరూరాపెట్టి అనధికారికంగా మద్యం అమ్ముతున్న ట్లు ఆరోపిస్తున్నారు.

**పేరుకు కిరాణం... లోపల మద్యం**

గ్రామాల్లో పేరుకు కిరాణా దుకాణాలు నిర్వహిస్తూ లోపల మాత్రం మద్యం వ్యాపారం చేస్తున్నారు. సొంత ఇళ్లలో పెద్ద ఫ్రిజ్జులు ఏర్పాటు చేసుకుని బీర్లు విక్రయిస్తున్నారు. వైన్షాపుల యజమానులు ఆటోల ద్వారా మద్యాన్ని ఊరూరా సరఫరా చేస్తున్నారు. తమకు కేటాయించిన గ్రామాలకు నిత్యం ఆటోల ద్వారా పంపించి అమ్ముతున్నారు. మద్యం తాగి చాలామంది ఇళ్ళ మ ధ్యలో గొడవలు పడుతూ అర్ధరాత్రి వరకు నానా రభస చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రతి గ్రామంలో బెల్ట్ షాపుల కారణంగా మద్యం ఏరులై పారుతోంది.

**నెలవారీ మామూళ్లు**

నిబంధనల ప్రకారం మద్యం దుకాణాల్లో చీప్ లిక్కర్ క్వార్టర్



మద్యం రూ.110 కు విక్రయించాలి. కానీ, రూ.30 అదనంగా పెంచి అమ్ముతున్నారు. బెల్టుషాపు నిర్వాహకులు రూ.110 ధర ఉన్న క్వార్టర్ బాటిల్ను రూ.150కు విక్రయిస్తున్నారు. ఆయా మద్యం దుకాణాలకు సంబంధించిన పరిధిని నిర్ణయించి బెల్టుషాపులకు మద్యం విక్రయిస్తుండటంతో పాటు ముందస్తు సమాచా రంతో ఎక్సైజ్శాఖ అధికారులు బెల్టుషాపులవైపు కన్నెత్తి చూడట్లేదనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూమ్లకు అనుమతి ఇచ్చారు. ఎక్సైజ్ , పోలీస్ శాఖల పేరుతో మామూళ్ల వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



## కార్పొరేట్ మెడికల్ బోర్డు నిలిపివేత

**-- సీఎంబీని నిర్వహించాలని సీఎండీకి వినతి**



**టీ మీడియా,మార్చి10,రుద్రంపూర్ :** సింగరేణి సంస్థలో ఉద్యోగుల ఆరోగ్య సామర్థ్యాన్ని (ఫిట్నెస్) అంచనా వేసే కార్పొరేట్ మెడికల్ బోర్డు సమావేశాల నిర్వహణలో ఏర్పడిన అంతరాయంపై ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మార్చి 2025 వరకు క్రమం తప్పకుండా నిర్వహించబడిన మెడికల్ బోర్డు సమావేశాలు ఆ తర్వాత నిలిచిపోయినట్లు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్లోని సింగరేణి భవన్లో సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ద ప్రకాష్ జ్యోతిని కలిసిన ప్రతినిధులు ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత బోర్డుల ద్వారా హయ్యర్ సెంటర్లకు రిఫర్ చేయబడిన ఉద్యోగుల కోసం జూలై 2025లో ఒక ప్రత్యేక బోర్డు నిర్వహించగా అనంతరం సిక్ రోల్స్లో ఉన్న ఉద్యోగుల కోసం నవంబర్ 2025లో మరోసారి మెడికల్ బోర్డు నిర్వహించినట్లు తెలిపారు. అయితే అప్పటినుండి ఇప్పటి వరకు ఎటువంటి బోర్డు నిర్వహించకపోవడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేశారు.కార్పొరేట్ మెడికల్ బోర్డు తీసుకుంటున్న నిర్ణయాలపై కూడా పునఃసమీక్ష అవసరమని ఉద్యోగి ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. తీవ్రమైన గుండె జబ్బులు, నరాల సంబంధిత వ్యాధులు, కిడ్నీ సమస్యలు, శారీరక వైకల్యాలతో బాధపడుతున్న కొంతమంది ఉద్యోగులను కూడా విధులకు అర్హులుగా ప్రకటించిన

మిగతా 3లో

# ఏడు వందల ఇళ్లు కూల్చివేత

**-311మందికి టోకెన్లు**

**-మంత్రుల చేతుల మీదుగా పట్టాలు**

**టీ మీడియా,మార్చి10,ఖమ్మం బ్యూరో :** ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల ప్రాంతంలో భూదాన్ భూముల వివాదం కొత్త మలుపు తిరుగుతోంది. ఇటీవల అక్కడ జరిగిన కూల్చివేతల తర్వాత ప్రభుత్వం అదే ప్రాంతంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. కూల్చివేతల వల్ల ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు ప్రత్యామ్నాయంగా పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఇప్పటికే ఖమ్మం కలెక్టరేట్లో టోకెన్ల జారీ ప్రక్రియ ప్రారంభమైనట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.కూల్చివేతల అంశం గత కొద్ది రోజులుగా పెద్ద చర్చగా మారింది. అక్రమ నిర్మాణాల పేరుతో భారీగా ఇళ్లు కూల్చివేయడంతో బాధిత కుటుంబాలు నిరసనలు వ్యక్తం చేశాయి. ఈ అంశంపై ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు కూడా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాయి. దీంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

**మంత్రుల చేతుల మీదుగా**

ముగ్గురు మంత్రుల చేతుల మీదుగా పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. వెలుగుమట్లలో జరిగిన కూల్చివేతలు జిల్లా రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. సుమారు ఏడు వందల ఇళ్లు కూల్చివేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనపై వివిధ పార్టీలు తీవ్ర విమర్శలు చేశాయి. కూల్చివేతల అంశం సామాజిక మాధ్యమాల్లో కూడా విస్తృతంగా చర్చకు వచ్చింది. ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులపై



కూడా విమర్శలు రావడంతో ప్రభుత్వం ఇరుకున పడిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో బాధితులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చినట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

**మంత్రుల హామీ**

బాధితుల సమస్యపై స్పందించిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇటీవల ఖమ్మం కలెక్టరేట్లో

మిగతా 3లో



## పరీక్ష సామగ్రి పంపిణీ

**టీ మీడియా,మార్చి10,ఖమ్మం రూరల్:** ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు-పోలేపల్లి హై స్కూల్‌లో పదో తరగతి విద్యార్థిని విద్యార్థులకు మంగళవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. గోళ్లపాడు, పోలేపల్లి గ్రామాల సర్పంచులు గుండు శ్రావణి శ్రీనివాస్, బత్తిని మహేశ్‌తో కలిసి గోళ్లపాడు వాసి పంతులు నాయక్ 50 మంది విద్యార్థులకు అవసరమైన ఫ్యాడ్ లు, పెన్నులు, జామెంటరీ బాక్స్ లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరికొద్ది రోజుల్లో 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయని, విద్యార్థులు శ్రద్ధతో చదివి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. తద్వారా గ్రామానికి, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు రంగా వెంకట్రావు, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు మద్ది వీరారెడ్డి, సింగిరెడ్డి బోస్ రెడ్డి, కొండం ప్రభాకర్, తాళ్లపల్లి నవీన్ పాల్గొన్నారు.



## 99 రోజుల ప్రగతి ప్రణాళికా కార్యాచరణ

**-సర్పంచ్ జాటోత్ జాయి లూసి**

**టీ మీడియా,మార్చి10,కామేపల్లి:** ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం ముచ్చర్ల గ్రామంలో ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం , సర్పంచ్ జాటోత్ జాయి లూసి, పంచాయతీ కార్యదర్శి తాటి అనురాధ గ్రామ వీధుల్లో తిరుగుతూ ప్రజలాభిష్టాన్ని తెలుసుకున్నారు. గ్రామంలోని సమస్యలను గుర్తించారు. ఈ సందర్భంగా పైపులైన్ రిపేర్, పారిశుద్ధ్య పనులను సర్పంచులు స్వయంగా పలుగు, పారా పట్టి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ అవసరాలను అభివృద్ధిని ప్రగతి ప్రణాళికలో నిర్వహించుకుందామన్నారు. ప్రజల అభీష్టం మేరకు గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయింపు జరుగుతుందని వాటిని సద్వినియోగం చేసుకోవడానికి ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రేగళ్ల ఉమా, వార్డ్ మెంబర్లు, గ్రామ పెద్దలు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..



### పదవ తరగతి విద్యార్థులకు

## పరీక్ష సామాగ్రి వితరణ

**టీ మీడియా,మార్చి10,సింగరేణి(కారేపల్లి) :** చంద్రు పౌండేషన్ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని మంగళవారం అందజేశారు. పౌండేషన్ స్థాపకులు సూర్యతండా ఉపాధ్యాయులైన భూక్యా వీరన్న కోమట్లగూడెం, కస్తూర్బావిద్యాలయం, గేటుకారేపల్లి, పేరుపల్లి, మూలపోచారం పదోతరగతి విద్యార్థులు 250 పరీక్షా సామాగ్రిని అందజేశారు. ఈసందర్భంగా భూక్యా వీరన్న మాట్లాడుతూ ఆర్ధికంగా వెనకబాటు ఉన్న విద్యార్థులకు పౌండేషన్ ద్వారా తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో పేరుపల్లి సర్పంచ్ బానోత్ పద్మవీరభద్రం, పాఠశాల హెచ్‌ఎంలు శారదా, ఝాన్సీసౌజన్య, జయరాజు, లక్ష్మి ఆనంద్, చంద్రు ఫౌండేషన్ సభ్యులు రవి, రమేష్ , భాను శ్రీ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# హామీలకే పరిమితమైన అనంతారం రోడ్డు

**గిరిజన గ్రామాలపై కొనసాగుతున్న వివక్ష - సీపీఐ(ఎం)**

**టీ మీడియా,మార్చి10,సింగరేణి(కారేపల్లి):** కారేపల్లి మండలంలో పూర్తి గిరిజన గ్రామమైన అనంతారం వెళ్లే రహదారి నిర్మాణం హామీలకే పరిమతమైందని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు విమర్శించారు. మంగళవారం కారేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ 2004లో బీటీ రోడ్డు మంజూరైనా కేవలం కంకర రోడ్డువేసి వదలేశారన్నారు. అప్పటి నుండి కంకరతేలిన రోడ్డుపైనే నిత్యం ప్రయాణిస్తూ 8 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతారం, రేగులగూడెం, రామ కృష్ణపురం గ్రామాల ప్రజలు తప్పని సరిగా రోజూ ఈ రహదారిపైనే రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. ఆ గ్రామాలకు వెళ్లాలంటే రోడ్డు సరిగా లేక ఆటోలు రాక పోవటంతో ప్రజలు ఇబ్బంధులు పడుతున్నారు. ఆ రహదారి మరమ్మతులు చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతులు ఇస్తున్నా వారు హామీలు ఇవ్వటం తప్ప అచరణలో చూపటం లేదన్నారు. అనంతారం రహదారిని పరిశీలిస్తే గిరిజన గ్రామాలపై పాలకులు వివక్షత స్పష్టంగా కనిపిస్తుందన్నారు. ఈ రహదారి బాగుకోసం సీపీఐ(ఎం) ఇప్పటికే గ్రామస్తులను సమీకరించి అందోళనరూపంలో ప్రభుత్వం దృష్టికి తీసుకవచ్చామన్నారు. ఈరహదారిని ఆర్ అండ్ బీ , విశాఖ స్టీల్ డోలమైట్ యాజమాన్యం ద్వారా బీటీ రోడ్డు వేయిస్తామన్నా ప్రజాప్రతినిధులు మాటపై నిలబడలేదన్నారు. ఇప్పటికైనా వైరా ఎమ్మెల్యే ఈ రహదారి పై దృష్టి పెట్టి అనంతారం రైల్వేగేట్ నుండి అనంతారం-చీమలవారిగూడెం-రేగులగూడెం- రామకృష్ణాపురం వరకు బీటి రోడ్డు



వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు.

## పంచాంగాల బహూకరణ



**టీ మీడియా,మార్చి10,సింగరేణి(కారేపల్లి):** కారేపల్లి,కామేపల్లి,గార్ల , రఘునాధపాలెం మండలాల పురోహితులకు సామాజిక కార్యకర్త ఇందుర్తి సురేందర్ రెడ్డి పంచాంగాలను బహూకరించారు.కారేపల్లి శివాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో విజయ విఘ్నేశ్వర అర్చక పురోహిత సంఘం అధ్యక్షులు కొత్తలంక కైలాస్ శర్మ కు సురేందర్ రెడ్డి ఈ పంచాంగాలను అందించారు.ఈ సందర్భంగా కొత్తలంక కైలాష్ శర్మ మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలుగా పురోహితులకు సురేందర్ రెడ్డి పంచాంగాలను బహుకరించడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో పురోహిత సంఘం ఉపాధ్యక్షులు వెలవలపల్లి వెంకటసురేష్ శర్మ,కోశాధికారి కొండపల్లి శ్రీనివాస్ శర్మ ,తుంగతుర్తి రామకృష్ణ శర్మ, రామరాజు ఉదయ్ కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల సమయస్ఫూర్తి

**- మహిళ ప్రాణాలు కాపాడిన వైనం**



**టీ మీడియా,మార్చి 10, ముదిగొండ :** కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ప్రాణాలు తీసుకోవాలని నిర్ణయించుకున్న ఒక మహిళను ముదిగొండ పోలీసులు సకాలంలో స్పందించి కాపాడారు. మానవత్వంతో వ్యవహరించి ఒక నిండు ప్రాణాన్ని కాపాడిన పోలీసులపై స్థానికులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.
ఘటన వివరాల్లోకి వెళ్తే.
ఖమ్మం నగరానికి చెందిన శైలజ అనే మహిళ గత కొంతకాలంగా కుటుంబ తగాదాలతో సతమతమవుతున్నారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది, ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతో ముదిగొండ మండలం గోకినేపల్లి జాతీయ రహదారి వద్దకు చేరుకున్నారు. అక్కడ ఉన్న బ్రిడ్జి పైనుంచి దూకేందుకు ఆమె ప్రయత్నిస్తుండగా, అదే సమయంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసు బృందం ఎస్ఐ కృష్ణ ప్రసాద్ ఆమెను గమనించారు.

**సకాలంలో స్పందన**

పరిస్థితిని అర్థం చేసుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని, ఆమెను అడ్డుకుని సురక్షితంగా బ్రిడ్జి పైనుంచి కిందకు దించారు. అనంతరం ఆమెను పోలీస్ స్టేషన్‌కు తరలించి ప్రాథమికంగా కౌన్సెలింగ్ ఇచ్చారు.

**కుటుంబ సభ్యులకు అప్పగింత**

సిఐ మురళి ఆదేశాల మేరకు పోలీసులు శైలజ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆమె కూతురు స్పందన పోలీస్ స్టేషన్‌కు చేరుకోగా, ఆమె సమక్షంలో తల్లికి ధైర్యం చెప్పి, క్షేమంగా ఇంటికి పంపించారు. ఆపదలో ఉన్న తమ తల్లిని కాపాడినందుకు స్పందన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## కార్పొరేట్ మెడికల్ బోర్డు నిలిపివేత

సందర్భాలు ఉన్నాయని వారు తెలిపారు. ఇటువంటి ఉద్యోగులను విధుల్లో కొనసాగించడం వారి భద్రతకే కాకుండా ఇతర ఉద్యోగుల భద్రతకూ ప్రమాదకరమని సి అండ్ ఎండి కి వెల్లడించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో జూలై, నవంబర్ 2025లో నిర్వహించిన మెడికల్ బోర్డుల్లో 'ఫిట్'గా ప్రకటించబడిన ఉద్యోగులకు మరలా వైద్య పరీక్షలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఇప్పటికే పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు.అదేవిధంగా గతంలో అమలులో ఉన్న విధంగా కార్పొరేట్ మెడికల్ బోర్డును ప్రతి నెలా క్రమం తప్పకుండా నిర్వహించాలని కోరారు. మరణించిన లేదా వైద్యపరంగా అనర్హత పొందిన ఉద్యోగుల వారసులకు ఇచ్చే కారుణ్య నియామకాల ప్రక్రియ అక్టోబర్ 2025 నుండి నిలిచిపోయిందని, కంపెనీ నిబంధనల ప్రకారం ఆ ప్రక్రియను వెంటనే పునఃప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. కావున పై సమస్యలను యాజమాన్యం అత్యవసరంగా పరిశీలించి తక్షణమే పరిష్కారం చూపాలని ఉద్యోగి సంఘాల ప్రతినిధులు కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలోముఖ్య ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ, ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి ఉన్నారు.



## గుట్టకిందగుంపులో ప్రగతి ప్రణాళికా కార్యాచరణ

**పలుగు,పారా పట్టిన సర్పంచ్ ఉండం రాఘువులు**

**టీ మీడియా,మార్చి 10, సింగరేణి (కారేపల్లి):** కారేపల్లి మండలం గుట్టకింది గుంపులో ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం సర్పంచ్ ఉండం రాఘువులు వీధుల్లో తిరుగుతూ పలు సమస్యలను గుర్తించి, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను గుర్తించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య పనులను సర్పంచ్, స్వయంగా పలుగు, పారా పట్టి పనులను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ అవసరాలను అభివృద్ధిని ప్రగతి ప్రణాళికలో నిర్వహించుకుందామన్నారు. ప్రజల అభీష్టం మేరకు గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయింపు జరుగుతుందని వాటిని సద్వినియోగం చేసుకోవడానికి ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎండి పర్వీన్ , పంచాయతీ కార్యదర్శి నారాయణరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.






## 99 రోజుల ప్రణాళికకు నిర్లక్ష్యం

**మధ్యాహ్నామైతే చాలు గ్రామంలో కనిపించని కార్యదర్శి..**

**టీ మీడియా,మార్చి10, సింగరేణి (కారేపల్లి):** ఖమ్మం జిల్లా సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీలో అమలవుతున్న 'ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో పంచాయతీ కార్యదర్శి పనితీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.99 రోజుల కార్యక్రమం పేరుతో ఉదయం కొద్దిసేపు కార్యకలాపాలు నిర్వహించి ఫోటోలు తీసుకునే వరకు మాత్రమే గ్రామ కార్యదర్శి పరిమితమవుతున్నారని, అనంతరం గ్రామంలో ఉండటం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అనంతరం మధ్యాహ్ననికే పంచాయతీ కార్యాలయానికి తాళం వేసి వెళ్లిపోవడం కార్యదర్శి పనితీరు తేటతెల్లమ్ చేస్తుంది.గ్రామ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన సమయంలో కార్యాలయం మూతపడటంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థాయిలో కీలక బాధ్యతలు నిర్వహించాల్సిన కార్యదర్శి విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఎంపీఓ వివరణ**

ఈ విషయంపై మండల పంచాయతీ అధికారి మల్లెల రవీంద్ర ప్రసాద్ ను వివరణ కోరగా వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపిస్తామని తెలిపారు. 99 రోజుల కార్యాచరణ అమలులో కార్యదర్శి ల నిర్లక్ష్యం తేలితే సంబంధిత వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.




## కరపత్రాల పంపిణీ కార్యక్రమం

**టి మీడియా, మార్చి 10, మధిర:** 2026 – 27 విద్యా సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మధిర ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల విద్యార్థులకు కరపత్రాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఉజ్వలమైన భవిష్యత్తుకు ఆనందకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాభ్యాసం చేయుటకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మధిర నందే చేరాలని తమ యొక్క కోర్సు పూర్తయిన తర్వాత డిగ్రీ కోర్సులను ఎంచుకోవాలని తెలియజేస్తూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఇంటర్మీడియట్ విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష సెంటర్ల నందు కలిసి కరపత్రాలను పంపిణీ చేయడం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రవీంద్రారెడ్డి సూచనల మేరకు జరిగిన ఈ కరపత్రాల పంపిణీ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి. అరుణ, దోస్త్ కోఆర్డినేటర్ డా. ఎస్ ఇందిర, అధ్యాపకులు పి. శ్రీనివాసరావు, డా. కె రామకృష్ణ, డా.వి. నాగరాజు,కే.వెంకటేష్, పి లక్ష్మీనారాయణ, షేక్ ఇమ్రాన్ కరపత్రాలు పంపిణీ చేయడంతో పాటు కళాశాలకు ఉన్న సౌకర్యాలు వివరిస్తూ విద్యార్థులందరూ తప్పనిసరిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మధిర నందు డిగ్రీలో చేరవలసిందిగా కోరడం జరిగింది .కళాశాల నందు బీఏ, బీకాం,బీఎస్సీ జనరల్ , కంప్యూటర్ కోర్సులు ఉన్నాయని తెలియజేశారు. వర్చువల్,డిజిటల్ తరగతి గదులు నైపుణ్యత కలిగిన అధ్యాపకులు, గ్రంథాలయం ఇతర వనరుల గురించి తెలియజేశారు.



## కారేపల్లి కళాశాలకు కంప్యూటర్ వితరణ

**టీ మీడియా,మార్చి10,సింగరేణి(కారేపల్లి) :** కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు శ్రీ కోటమైసమ్మ ఆలయ ధర్మకర్త ప్రముఖ వైద్యులు డాక్టర్ పర్సాపట్టాభి రామారావు–డాక్టర్ పర్సా విజయలక్ష్మిలు మంగళవారం కంప్యూటర్ వితరణ చేశారు. డాక్టర్ పర్సా విజయలక్ష్మి, మల్లాది కార్తీక్‌ల మాతృమూర్తి , స్త్రీవాద రచయిత్రి మల్లాది సుబ్బమ్మ ట్రస్ట్ ద్వారా రూ.20వేల విలువైన కంప్యూటర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.విజయకుమారికి అందజేశారు. ఈసందర్భంగా డాక్టర్ పర్సా దంపతులు మాట్లాడుతూ పేద విద్యార్థులు అభ్యున్నతికి తమ ట్రస్ట్ ద్వారా సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికి విద్యార్థులకు కావల్సిన మెటీరియల్, ప్రతిభ పురస్కారాలు ఇస్తున్నట్లు తెలిపారు. దాతలను కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

## పర్యవేక్షణపై నిర్లక్ష్యం వీడండి

**-అధికారులే బాధ్యత వహించాల**

**-మున్సిపల్ చైర్ పర్సన్ సుజాత**

**టీ మీడియా,మార్చి10,మధిర :** మధిర పట్టణంలోని అండర్ డ్రైనేజీ పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత అన్నారు.సోమవారం మధిర పట్టణంలోని రెండవ వార్డు కౌన్సిలర్ రమణ నాయక్ తొ అండర్ డ్రైనేజీ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అండర్ డ్రైనేజీ నిర్వహణ,పర్యవేక్షణపై అధికారులు నిర్లక్ష్యం వీడాలని,ప్రజలను ఇబ్బందులకు గురిచేసే నిర్లక్ష్యాన్ని సహించబోనని అన్నారు.డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అండర్ డ్రైనేజీ ప్రాజెక్టు,నాణ్యత లోపిస్తే సహించేదే లేదన్నారు.ఎలాంటి నాణ్యత లోపించినా అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.అనంతరం అక్కడున్న అంగన్వాడి కేంద్రాన్ని దర్శించి కేంద్రంలో పిల్లలకు సరైన పోషక ఆహారం అందుతుందా, విద్యా కార్యక్రమాలకు సమర్థవంతంగా నడుస్తున్నాయా అనే అంశాలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సిడిపిఓ బాల త్రిపుర సుందరి, అండర్ డ్రైనేజీ ఏఈ తదితరులు పాల్గొన్నారు.

# 12న ప్రజా ప్రతినిధులకు శిక్షణ

**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**






**టీ మీడియా మార్చి 10, ఖమ్మం:**మార్చి 12న భక్త రామదాసు కళాక్షేత్రంలో సర్పంచ్, మున్సిపల్ చైర్ పర్సన్, వార్డు కౌన్సిలర్ లు వంటి ప్రజా ప్రతినిధులకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్ లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఖమ్మం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి పాల్గొన్నారు.ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా జరుగుతున్న పారిశుద్ధ్య పనులు, ఫైల్ క్లియరెన్స్, మార్చి12న సర్పంచ్, కౌన్సిలర్ లకు ఏర్పాటు చేయనున్న శిక్షణ కార్యక్రమంపై సీఎస్ సుదీర్ఘంగా చర్చించి పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అంశంపై ఖమ్మం జిల్లా ఇంచార్జి మంత్రివర్యుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. పారిశుధ్య నిర్వహణ, ఫైల్స్ క్లియరెన్స్ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా జరుగుతున్నదని కలెక్టర్ తెలిపారు. క్షేత్ర స్థాయి సందర్శనలో సర్పంచ్, మున్సిపల్ చైర్ పర్సన్, వార్డు కౌన్సిలర్ల భాగస్వామ్యం, పారిశుధ్య నిర్వహణ కార్యక్రమంలో ఉండటం గమనించినట్లు కలెక్టర్ తెలిపారు. మార్చి 12న భక్త రామదాసు కళాక్షేత్రంలో సర్పంచ్, మున్సిపల్ చైర్ పర్సన్, వార్డు కౌన్సిలర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులకు నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ప్రతి ప్రజా ప్రతినిధికి ఆహ్వానం అందేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. ప్రోటోకాల్ ప్రకారం వివిఐపి, వి.ఐ.పి. లకు ఆహ్వానం అందేలా జాగ్రత్తలు పాటించినట్లు అన్నారు. శిక్షణ కార్యక్రమానికి వచ్చే ప్రజా ప్రతినిధులకు అవసరమైన ఆహారం, ఇతర ఏర్పాట్లు కూడా కల్పించామని, ఆడియో, వీడియో వ్యవస్థ సరిగ్గా ఉండేలా చర్యలు చేపట్టామని అన్నారు.శిక్షణ కార్యక్రమంలో ఉదయం సెషన్ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణ, 10 థీమ్స్ లో వివిధ శాఖల ద్వారా చేపట్టే పనులు, ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంపై అవగాహన కల్పిస్తామని, లంచ్ అనంతరం పిఆర్ చట్టం, మున్సిపల్ చట్టంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.వీసీ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూలి శిక్షణ కార్యక్రమం సంబంధించి మినెట్ టు మినెట్ ప్రోగ్రాం షెడ్యూల్ తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. పిఆర్ చట్టంపై ఇది వరకే శిక్షణ అందించినందున, దానికి కొంత సమయం కేటాయించి, మున్సిపల్ యాక్ట్ ముఖ్యమైన అంశాలు క్లియర్ గా తెలిసేలా అవగాహన కల్పించాలన్నారు. శిక్షణ కార్యక్రమం అనంతరం స్థానిక ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం ఉండేలా ఇంటారాక్టివ్ సెషన్ పెట్టాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, విద్య, వైద్య శాఖలో చేపడుతున్న చర్యలు వంటి ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు, వాటి అమలులో ఎదురయ్యే ఇబ్బందులు, పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల గురించికూడాస్థానికప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో సమావేశంలో ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, సిపీఓ ఏ. శ్రీనివాస్, డిఆర్డిఓ కె. శ్రీరాం, డిపిఓ రాంబాబు, మునిసిపల్ కమీషనర్ లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# యస్.బి.ఐ.టి. లో ప్రారంభమైన ఏ.ఐ. వర్క్‌షాప్



**టీ మీడియా మార్చి 10, ఖమ్మం బ్యూరో :** విద్యా, ఉపాధి రంగాలలో ఏ.ఐ. ద్వారా శిక్షణను పొందే విధానాలపై తమ కళాశాలలో 5 రోజుల వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. సాఫ్ట్‌వేర్ రంగ ఉద్యోగానికి సిద్ధమవుతున్న విద్యార్థులు స్మార్ట్‌వేలో అభ్యసించాలని కోరారు. టెక్నికల్ స్కిల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్ పెంపొందించడానికి కృతిమ మేధ ఉపయోగపడుతుందని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కె.ఎల్. యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డా॥ సయ్యద్ కరీమున్నీసా పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేసారు.శిక్షణకు సంబంధించి ఎప్పుడైనా, ఎక్కడైనా నేర్చుకునే సౌలభ్యం ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా కలుగుతుందని డా॥ కరీమున్నీసా తెలిపారు. కృతిమ మేధను ఈ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌లో అనుసంధానిచడం ద్వారా క్రిటికల్ థింకింగ్, అతిక్లిష్టమైన ప్రశ్నలకు పరిష్కారం, డీబగ్గింగ్ మరియు ఆప్టిమైజ్డ్ సొల్యూషన్స్‌ను అందిస్తుందని తెలిపారు. ఏ.ఐ. తో శిక్షణను అందించడంలో ఛాట్ జిపిటి, గిట్‌హబ్, కో పైలట్ వంటి టూల్స్‌ను ఉపయోగిచంవచ్చని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి తెలిపారు. కోడింగ్‌కు ప్రత్యేకించి లీట్‌కోడ్, హ్యాకర్‌ర్యాంక్, కోడ్‌చెఫ్ వంటి సాధనాలను వినియోగించుకోవాలని కళాశాల వైస్ ఛైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా॥ జి. రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఏ.ఐ. అనుసంధానమైన కోడింగ్ పోటీలలో పాల్గొనడం ద్వారా విద్యార్థులకు గుర్తింపు, సర్టిఫికేట్స్, బ్యాడ్జస్ వంటివి సాధించగలరని,



వారి ప్రతిభ ఆన్‌లైన్‌లో వివిధ కంపెనీలవారికి అందుబాటులో ఉంటుందని తద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి డా॥ సయ్యద్ కరీమున్నీసాను సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా॥ ఎ.వి.వి. శివ ప్రసాద్, సి.యస్.ఈ. విభాగపు అధిపతి డా॥ సుప్రియామీనన్, సి.యస్.ఈ. (ఏ.ఐ.యమ్.ఎల్) విభాగపు అధిపతి డా॥ కె. స్ఫూర్తి, టి.పి.ఒ. యన్. సవిత, కోఆర్డినేటర్ డా॥ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పత్రా ముత్యం ఆశయాలు కొనసాగిస్తాం - సిపిఎం



**టీ.మీడియా,మార్చి10,చింతూరు:** పట్ర ముత్యం 12వ వర్ధంతి కార్యక్రమాన్ని తుమ్మల గ్రామంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఆయన స్థూపం వద్ద ముత్యం చిత్ర పటానికి పార్టీ మండల కార్యదర్శి పల్లపు వెంకట్, సీసం సురేష్ లు పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది.ఈ సందర్భంగా జరిగిన సభలో సిపిఎం మండల కార్యదర్శి పల్లపు వెంకట్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు సీసం సురేష్లు మాట్లాడుతూ బ్రతికున్నన్ని రోజులు ఆదివాసి ప్రాంత సమస్యలపై గిరిజనులను చైతన్యం చేస్తూ,ఐక్య పోరాటాలు నిర్వహించి ఎర్రజెండా ఆధ్వర్యంలో స్థానిక సమస్యలను పరిష్కరించే విధంగా ఎనలేని కృషి చేసిన వ్యక్తి అమరజీవి కామ్రేడ్ పట్ర ముత్యం అని అన్నారు. మావోయిస్టులు 2014 లో అర్థాంతరంగ ముత్యంను హతమార్చడం దిగజారు తనానికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు మొట్టుం రాజయ్య, మల్లం సుబ్బమ్మ, పోడియం లక్ష్మణ్, మండల కమిటీ సభ్యులు ఎర్రంశెట్టి శ్రీనివాస్, వేక రాజ్ కుమార్,చింతా రాంబాబు, పట్రా రమేష్, కలుముల మల్లేష్, సోడి రాఘవయ్య, సోడి రెడ్డి, పొడియం జానీ, రామారావు, కలుముల ముత్తయ్య, సోడి దుర్గారావు, ముత్యం కుటుంబ సభ్యులు రాధాకృష్ణ, పాపారావు, చిట్టెమ్మ, నాగమణి, జయ తదితరులు పాల్గొన్నారు.

## ఏడు వందల ఇళ్లు కూల్చివేత

మీడియాతో మాట్లాడారు. కూల్చివేతల వల్ల ఇళ్లు కోల్పోయిన అర్హులైన కుటుంబాలకు ప్లాట్లు ఇచ్చి ఇళ్లు నిర్మించేందుకు సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రకటన తర్వాత జిల్లా అధికార యంత్రాంగం వేగంగా చర్యలు ప్రారంభించింది. రెవెన్యూ అధికారులు అర్హులైన వారిని గుర్తించి టోకెన్లు జారీ చేసే ప్రక్రియ చేపట్టారు. ప్రస్తుతం భూమిని చదును చేసే పనులు కూడా యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి.